


రెవెన్యూ సదస్సును వాయిదా వేయండి :సిపిఎం



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి జిల్లాలో తుపాను వల్ల బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్నాయని, ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సులను వాయిదా వేసి, తుపాను సహాయక చర్యల్లో అధికారులు పాల్గొనాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు విజ్ఞప్తి చేశారు. ఈ వర్షాల కారణంగా ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. చాలా ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయి. గతంలోనే నిండిపోయిన చెరువులకు గండ్లు పడే అవకాశం ఎక్కువగా ఉంటున్నాయి. కళాశాలలు, పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో రెవెన్యూ యంత్రాంగం తుఫాను సహాయ చర్యల్లో పాల్గొనడం సముచితంగా ఉంటుంది. రెవెన్యూ సదస్సులు వాయిదా వేసి సహాయ చర్యల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ శుభం బన్సల్ వెంటనే స్పందించి తగు సూచనలు చేయాలని కోరారు.



తిరుపతి అండర్ రైల్వే మార్గంలో..

నేడూ పాఠశాలలకు ముందస్తు సెలవు ప్రకటన

కుండపోత

ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు
ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేతకు సిద్ధం
చెరువులను తలపిస్తున్న రహదారులు
వేలాది ఎకరాల్లో నీట మునిగిన వరి నారు
కలెక్టరేట్ కంట్రోల్ నంబర్ 0877-2236007

కలెక్టరేట్ తుఫాను కంట్రోల్ రూమ్ నెంబర్
0877-2236007
గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం
9849904062
సూళ్లూరుపేట ఆర్ డి ఓ కార్యాలయం
9441984020
తిరుపతి ఆర్ డి ఓ కార్యాలయం
7032157040
శ్రీకాళహస్తి ఆర్ డి ఓ కార్యాలయం
6281156474



ఏర్పేడులో జోరువానలో విధులు నిర్వహిస్తున్న ఎఇ వాసుదేవయ్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో తిరుపతి జిల్లాను భారీ వర్షం ముంచెత్తుతోంది. బుధవారం నుంచి వర్షం ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్లుగా ఆగకుండా కుండపోతగా కురుస్తూనే ఉంది. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. నెల్లూరు జిల్లాకు ఆనుకుని ఉన్న తూర్పు మండలాల్లో 15 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. బిఎన్‌కండ్రిగ, దక్కిలి, వరదయ్యపాలెం, బాలాయపల్లి, వడమాలపేటల్లో వర్షపాతం ఎక్కువగా కురిసింది. కాళంగి, అరణియార్, మల్లిమడుగుల డ్యామ్‌ల పరిస్థితిని ఇరిగేషన్ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. కపిలతీర్థం ఉధృతంగా ఎగిసిపడుతోంది. శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల్లో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తిరుపతి నగరంలో రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. లక్ష్మీపురం సర్కిల్ వద్ద రోడ్డుపైనే వాహనదారులు వెళ్లలేని పరిస్థితి. డీఆర్ మహల్, వెస్ట్ అండర్ బ్రిడ్జి వద్ద వర్షపునీరు నిలిచిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. మురికివాడల్లో మురుగునీరు రోడ్లపై కంపుకొడుతోంది. తూర్పు మండలాల్లో విస్తారంగా వరి నారు వేలాది ఎకరాల్లో నీట మునిగి ఉంది. గురువారం చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. శుక్రవారమూ పాఠశాలలకు ముందస్తుగానే సెలవును ప్రకటించారు.

కాజ్‌వేలు దాటేటప్పుడు జాగ్రత్త : జేసీ

జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు ఎవరూ ప్రయాణాలు చేయరాదని, కాజ్‌వేపై నీరు ప్రవహిస్తుంటే పొరపాటున కూడా దాటరాదని జేసీ శుభంబన్సల్ అత్యవసర హెచ్చరికలు జారీ చేశారు. డ్రైనేజీ కాల్వలు బ్లాక్ అయితే వాటిని క్లియర్ చేయాలన్నారు. అధికారులు 24/7 ప్రధాన కార్యాలయాల్లో ఉండాలన్నారు. కోస్తా తీర ప్రాంతాలైన గూడూరు డివిజన్ కోట, చిల్లకూరు, వాకాడు, సూళ్లూరుపేట డివిజన్ తడ మండలాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జేసీ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

లోతట్టు ప్రాంతాలు పరిశీలించిన కమిషనర్

వరదల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు రావద్దని కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. నగరంలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అండర్‌బ్రిడ్జిల వద్ద నీరు నిలిస్తే తొలగించేందుకు మోటర్లను సిద్ధంగా ఉంచుకున్నారు. విద్యుత్ అంతరాయం రాకుండా చర్యలు చేపట్టనున్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా వెంటనే హెల్ప్ లైన్ నంబర్లను 08772256766, 9000822909 సంప్రదించాలని సూచించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఉన్నారు. 17 ప్రాంతాల్లోని పునరావాస కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కల్వర్టు నిర్మాణం కోసం పోరాటం చేస్తా: మోహిత్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ కేబీఆర్ నగర్ వద్ద వంతెన కడతామని కాలయాపన చేస్తు వంచిస్తున్నారని చంద్రగిరి నియోజకవర్గ వైసిపి బాధ్యులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. గురువారం అల్పపీడనం కారణంగా కేబీఆర్ నగర్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువను, స్థానికంగా నివాసమున్న ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మీ హయాంలో దశాబ్దా కాలంగా అభివృద్ధి చెందని కేబీఆర్ నగర్లో రోడ్లు, డ్రైయిన్లు నిర్మించారని, కల్వర్టు నిర్మాణం కూడా పూర్తి చేసే ఉంటే తమకు ఎంతో సౌకర్యం ఉండేదని స్థానిక నివాసులు మోహిత్‌కు తెలిపారు. కల్వర్టు నిర్మాణానికి ప్రభుత్వంతో పోరాటం చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. వర్షం కారణంగా వాహనాలు సైతం మొరాయించడంతో కాలినడకన కేబీఆర్ నగర్‌కు మోహిత్ రెడ్డి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల నగర్ పంచాయతీ వైసిపి బాధ్యులు గుండ్రాజు శివశంకర్ రాజు, తిరుపతి రూరల్ మండల వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ చిలమంద హరికృష్ణ పాల్గొన్నారు.

పిచ్చాటూరు- శ్రీకాళహస్తి రోడ్డుకు మోక్షం

పిచ్చాటూరు : ఎంఎల్‌ఎ కోనేటి ఆదిమూలం ఆదేశాల మేరకు పిచ్చాటూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త స్పందించారు. పిచ్చాటూరు – శ్రీకాళహస్తి రోడ్డు పిచ్చాటూరు నుంచి అరణియార్ గేట్ల వరకూ పెద్దపెద్ద గుంతలమయమై వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఎంఎంసి మాజీ ఛైర్మన్ ఇలంగోవన్‌రెడ్డి స్థానిక ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లారు.

దిగువకు అరణియార్ వరదనీరు

అరణియార్ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నీటి మట్టం చేరుకుందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు భారీగా వచ్చి చేరడంతో దిగువ వరద నీరు విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఉదయం 11 గంటలకు అరణియార్ రెండు స్పిల్ వే గేట్లు ద్వారా దిగువకు వరద నీరు విడుదల చేశారు. ఎగువ ప్రాంతాల్లో వరద నీరు అంచనా ప్రకారం దిగువకు అదే స్థాయిలో వరదనీటిని విడుదల చేస్తామన్నారు. అరణియార్ ప్రాజెక్టు నీటి సామర్థ్యం 1.85 టిఎంసిలు. ఆయకట్టు లెవల్ 281 అడుగులకు 280.5 అడుగులకు వరద నీరు చేరుకుంది. పరివాహక ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలనిసూచిస్తున్నారు. వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్‌ఎ కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. అరణియార్, కాళంగి రిజర్వాయర్లు పూర్తిస్థాయిలో నిండాయన్నారు.

రోడ్డుమార్గం మూసివేత

పిచ్చాటూరులోని అరణియార్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు 5,600 క్యూసెక్కుల నీరు విడుదల చేయడంతో అరుణానది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో శ్రీకాళహస్తి – పిచ్చాటూరు రోడ్డు మార్గాన్ని మూసివేసినట్లు మండల తహశీల్దార్ రమేస్‌బాబు, ఎస్‌ఐ వెంకటేష్, ఆర్‌ఐ సుధాకర్ తెలిపారు.

చంద్రగిరి ముఖద్వారంలో వరద ఉధృతి

రామచంద్రాపురం (చంద్రగిరి) : తిరుపతి జిల్లా చంద్రగిరిలో పూతలపట్టు –నాయుడుపేట జాతీయ రహదారి నుండి చంద్రగిరిలోకి వెళ్లేందుకు ముఖద్వారమైన వెంకటం పేట వద్ద స్వర్ణముఖిని తలపించేలా ఆర్ అండ్ బి రోడ్డుపై మురికి నీరు చేరడంతో రోడ్డుపై ప్రయాణించే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జాతీయ రహదారి నుండి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి తిరుమలకు వెళ్లే శ్రీవారి భక్తులు చంద్రగిరిలోకి ఆ ఆర్ అండ్ బి మార్గంలోనే వాహనాలలో, నడిచి వెళుతుంటారు. గత ఐదేళ్లుగా వర్షాలు పడినప్పుడల్లా ఇదే పరిస్థితి ఉంటున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నది స్థానికుల ఆవేదన.

అమ్మగారి చెరువు కట్ట లీకేజీ

మండలంలోని అనుపల్లి నుండి రాయల చెరువులోకి కలిసే పెద్దేటి వంక, నడలూరు సమీపంలో ఉన్న నక్కలవంక వరద నీటితో ఉధృతంగా ఉరకలు పెట్టాయి. కమ్మపల్లి గ్రామానికి సమీపంలో ఉన్న అమ్మగారి చెరువు వరద నీటితో నిండిపోయి జలకళ ఏర్పడింది. అమ్మగారి చెరువు కట్ట లీకేజ్ కావడంతో స్థానిక తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో ఇందిరా, ఇరిగేషన్ ఏఈ ఎత్తి రాజులు, ఆర్ ఐ లక్ష్మీనారాయణ లో ముందస్తు పరిశీలనలో భాగంగా గుర్తించి చర్యలు చేపట్టారు. స్థానిక శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) అధికారులతో కలిసి అమ్మగారి చెరువు కట్ట లీకేజీని పరిశీలించి జెసిబి తో మట్టిని పోయించారు. కమ్మపల్లి సమీపంలో వర్షాల కారణంగా కూరగాయల పంటలు పూర్తిగా వర్షపు నీటితో మునిగిపోయాయి. వాగులోని బురదలో ఇరుక్కుపోయి బూచి రెడ్డికి చెందిన పాడి ఆవు చనిపోయింది.

లోతట్టు ప్రాంత ప్రజలను ఆదుకోండి : సిపిఎం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న పేద ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న పేద ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని వాపోయారు. ఫెంగల్ తుఫాన్ ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ప్రజానీకాన్ని కురుస్తున్న భారీ వర్షాలు మరింత ముప్పులోకి నెట్టాయని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గం పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరి ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. వ్యవసాయ, భవన నిర్మాణ రంగ కూలీలకు పని కరువైందన్నారు. ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమై లోతట్టు ప్రాంత ప్రజలకు అండగా నిలబడాలని సూచించారు. ప్రతి కుటుంబానికి 15 కిలోల బియ్యం, రెండు లీటర్ల ఆయిల్, కంది పప్పు, తదితర నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని కోరారు. అదేవిధంగా రెండు రోజులుగా ఉపాధి కోల్పోయిన వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ రంగ కూలీలకు రూ. వెయ్యి భతి చెల్లించాలని డిమాండ్ చేశారు.

జోరు వర్షంలో విద్యుత్ మరమ్మతులు

ఏర్పేడు: జోరున వర్షం కురుస్తున్నా ఏపీ ఎస్పీడీసీఎల్ సిబ్బంది బండారుపల్లిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఏఈ వాసు దేవయ్య ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి(సబ్ స్టేషన్ నంబరు: 9490615038, ఏఈ :9440811799) తీసుకు రావాలని కోరారు.

దళితవాడలోకి నీరు

బిఎన్ కండ్రిగ : పద్మావతిపురం దళితవాడలో బుధవారం నుంచి కురుస్తున్న వర్షానికి 15 కుటుంబాల్లోకి వరదనీరు చేరింది. ఇంట్లోని వస్తువులన్నీ తడిచిపోయాయి. వాన నీరు ఎటూ పోవడానికి లేకపోవడంతో ఇళ్లను ముంచెత్తిందని, త్వరలోనే డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు చేస్తామని సర్పంచి తెలిపారు. పంచాయతీ కార్యదర్శి జెసిబి ద్వారా కాల్వలను తీసి వరదనీటిని బయటకు పంపారు.

పట్టు తప్పితే ప్రాణాలు హరి

కెవిబిపురం : మేజర్ పంచాయతీ అయిన పూడి, సికెపురం పంచాయతీల్లో వర్షం వచ్చిందంటే తిప్పలే. రాజులకండ్రిగ వద్ద ఉన్న కాజ్‌వే కొట్టుకుపోవడంతో వర్షాకాలంలో ఆరోగ్య సమస్య వస్తే ఆస్పత్రికి వెళ్లేందుకు దారి లేక వారు ప్రాణాలను కోల్పోవాల్సిందే. ఫెంగల్ తుపాన్లో కాజువాయి కొట్టుకుపోయింది. పూడి– సికెపురం గ్రామానికి చెందిన నక్కలకోన రమేష్ అనే పశువుల కాపరి మూర్ఛవ్యాధి వచ్చి అడవిలో పడిపోయాడు. కాజ్‌వే దాటలేక వైద్యం అందక మృతిచెందాడు. ఈ విషయమై అధికారుల దృష్టికి, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్న విమర్శలు లేకపోలేదు. వర్షాకాలంలో రెండు నెలల వరకూ ఈ దారిలో వాహనాలు తిరిగే పరిస్థితి లేదు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అడిగిన ప్రతిసారీ తూతూమంత్రంగా గ్రావెల్ తోలి కాంట్రాక్టుదారులు జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జిని శాశ్వత ప్రాతిపదికన నిర్వహిస్తామని, తమ గ్రామాలకు ఏ అధికారినీ రానీయబోమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

స్మశానం వద్ద నిలిచిపోయిన నీరు

పుత్తూరు టౌన్ : తుపాను ప్రభావంతో పుత్తూరు రూరల్ తడుకు పంచాయతీ వేణుగోపాలపురం స్మశానవాటిక దగ్గర నీరు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం కలిగింది. తడుకు సర్పంచి బొబ్బిలి వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో మట్టిని తొలగించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ కండ్రిగ వార్డు మెంబర్ వెంకటముని పాల్గొన్నారు.

ముంపులో వేలాది ఎకరాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న కుండపోత వర్షాలు తిరుపతి జిల్లాలోని తూర్పు మండలాల్లో బీభత్సం సష్టించాయి. బుధవారం రాత్రి నుండి తూర్పు మండలాల్లో కుండపోతగా వర్షం కురుస్తోంది. దీంతో శ్రీకాళహస్తి, తొట్టంబేడు, పెళ్ళకూరు, దొరవారిసత్రం, కేవీబీపురం, బీఎన్ కండ్రిగ, వరదయ్య పాలెం, సత్యవేడు, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పెళ్ళకూరులో అత్యధికంగా 80 మి.మీ వర్షపాతం నమోదయింది. ఎక్కడ చూసినా రోడ్లమీద వర్షపు నీరు పెద్ద ఎత్తున చేరింది. దీంతో రోడ్లు కాలువలను తలపిస్తున్నాయి. వాగులు ఏర్లను గుర్తు చేశాయి. పలు మండలాల్లో వేలాది ఎకరాల వరి పంట ముంపునకు గురైంది. శ్రీకాళహస్తి–పిచ్చాటూరు మార్గంలో కోవనూరు వాగు, శ్రీకాళహస్తి–కాళంగి మార్గంలో చిట్టత్తూరు వాగు, శ్రీకాళహస్తి–వెంకటగిరి మార్గంలో ఉడమలపాడు వాగు, శ్రీకాళహస్తి–కాసరం మార్గంలో చోడవరం వాగు, శ్రీకాళహస్తి–కారాకొల్లు మార్గంలో కారాకొల్లు వాగు, శ్రీకాళహస్తి–సత్యవేడు మార్గంలో వరదయ్య పాలెం వాగులు పొంగి పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లోని పేదల ఇళ్లలోకి నీరు చేరడంతో నిత్యావసరాలకూ జనం అల్లాడిపోతున్న పరిస్థితి. ఎడతెరపిలేని వర్షాలు మరో రెండు రోజులు కురిస్తే జనజీవనం మరింత అస్తవ్యస్తంగా మారే ప్రమాదం ఉంది. ముఖ్యంగా నిండుకుండలను తలపిస్తున్న చెరువులకు గండ్లు పడే ప్రమాదం ఉంది.

వరదయ్యపాలెంలో షికారీల నిరసన

ప్రజాశక్తి - వరదయ్యపాలెం



రోడ్డుకు అడ్డంగా మహిళ నిరసన

వరుసగా కురుస్తున్న వర్షాలకు తమను కూటమి ప్రభుత్వం, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని చిన్న పాండూరు సమీపంలోని షికారీలు నిరసనకు దిగారు. ఆ మేరకు గురువారం మధ్యాహ్నం సత్యవేడు–వరదయ్యపాలెం ప్రధాన రోడ్డు మార్గంలోని నక్కల మిట్ట వద్ద రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. భారీ వర్షాలకు తమ ప్రాంతం అతలాకుతలం అవుతున్నా అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ కనీస వసతులు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. అధికారులు స్పందించి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. పెద్దఎత్తున వాహనాలు బారులు తీరాయి. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఉన్న కారణంగా అటు శ్రీసిటీ పరిధిలో ఉన్న పరిశ్రమల నుంచి, ఇటు ఎపిఐఐసి పరిశ్రమల నుంచి విధులు పూర్తి చేసుకుని ఇళ్లకు వచ్చే కార్మికులు నిరసనల్లో చిక్కుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న శ్రీసిటీ డిఎస్‌పి పైడేశ్వరరావు అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నిస్తానని హామీ ఇవ్వడంతో షికారీలు నిరసనను విరమించారు.



గోవర్ధనపురం మారేడుకాల్వ బ్రిడ్జిపై..

అత్యధికంగా బిఎన్ కండ్రిగలో ...

తిరుపతి జిల్లాలో భారీ వర్షం నమోదయ్యింది. గురువారం సాయంత్రం ఏడు గంటలకు నమోదైన వర్షపాత వివరాలు...బుచ్చి నాయుడు కండ్రిగలో 169.2 మి.మీ, కెవి బి పురం 159.6, సూళ్లూరుపేట 143, దక్కిలి 136.4, వడమాలపేట 127.8, వరదయ్యపాలెం 120.4, బాలాయపల్లి 119.6, తడ 115.6, తొట్టంబేడు 102.6, శ్రీకాళహస్తి 99.4, పుత్తూరు 97.4, దొరవారిసత్రం 96.0, పెళ్లకూర్ 94.8, రేణిగుంట 94.8, వెంకటగిరి 91.8, ఏర్పేడు 90.4, సత్యవేడు 88 . 4, రామచంద్రపురం 87.8, నాయుడుపేట 76.4, తిరుపతి (గ్రామీణ) 70 . 4, తిరుపతి (అర్బన్) 6 8.4, నారాయణవనం 65.2, చిట్టమూరు 64 .4 , చంద్రగిరి 58.2, పాకాల 57.4, వాకాడు 57 . 0, చిన్నగొట్టిగల్లు 56.6, పిచ్చాటూరు 55.2, ఓజిలి 52.4, నాగలాపురం 47.6, ఎర్ర వారి పాలెం 44.6, కోట 28.0, గూడూరు 27.4, చిల్లకూరు 26.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. మొత్తం చిత్తూరు జిల్లాలో 2890.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది..



వర్షంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పరిశీలన

భారీ వర్షంలోనూ ఎస్‌డబ్ల్యుఎఫ్ రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - గూడూరు టౌన్

ఎపిఎస్‌ఆర్‌టిసి గూడూరు డిపో పరిధిలో కండక్టర్, డ్రైవర్ల అక్రమ సస్పెన్షన్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వారం రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపట్టినా అధికారుల్లో స్పందన లేకపోవడంతో గురువారం నుంచి డిపో ఎదుట భారీ వర్షంలోనూ 'రిలే నిరాహారదీక్షలు' చేపట్టారు. ఈ దీక్షల్లో అధ్యక్షులు రాము, డిపో కార్యదర్శి డి.శ్రీధర్‌లను సిఐటియు సీనియర్ నాయకులు గుర్రం రమణయ్య ఎర్ర రిబ్బన్లు మెడలో వేసి దీక్షల్లో కూర్చోబెట్టారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ సీనియర్ నాయకులు ఎం.శేషయ్య మాట్లాడుతూ ఈ సమస్య ఎస్‌డబ్ల్యుఎఫ్ ఒక్కరిదే కాదని, భవిష్యత్‌లో మిగతా యూనియన్లకు ఇలాంటి సమస్యలు ఎదురవుతాయన్నారు. ఉద్యోగుల సమస్యలను అర్థం చేసుకుని సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ట్రేడ్ యూనియన్ల నాయకులు జోగి శివకుమార్, ప్రజాసంఘాల నాయకులు కెఆర్‌ఎస్ దాసరి, సిఐటియు జిల్లా కమిటి సభ్యులు పి.శ్రీనివాసులు, గూడూరు పట్టణ సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు బివి రమణయ్య, ఎస్.సురేష్, ఆటోకార్మిక సంఘం నాయకులు ఆర్.శ్రీనివాసులు, వి.భాస్కర్‌రెడ్డి, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్ మద్దతు ప్రకటించారు. దీక్షల్లో ఎస్‌డబ్ల్యుఎఫ్ సభ్యులు జివి రమణయ్య, ఎస్‌ఎస్‌వి కృష్ణ, రఘురాం, ప్రభాకర్, డిఎస్ వాసు, చంద్రమోహన్, చంద్రయ్య పాల్గొన్నారు.



జోరువానలో ఆర్టీసీ కార్మికుల దీక్షలు

దక్షిణ మధ్య రైల్వే గుర్తింపు ఎన్నికల్లో సిఐటియు హవా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



దక్షిణ మధ్య రైల్వే గుర్తింపు ఎన్నికల్లో సిఐటియు అనుబంధ సంఘం విజయం సాధించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం ఓ ప్రకటనలో హర్షం ప్రకటించారు. డిసెంబర్ 4, 5, 5 తేదీల్లో దక్షిణ రైల్వేలో జరిగిన గుర్తింపు ఎన్నికల కౌంటింగ్ గురువారం జరిగింది. ప్రతర్థిగా ఉన్న ఎస్‌ఆర్‌ఎంయు ఓటర్లను అనేక రకాలుగా ప్రలోభపెట్టినా ఖాతరు చేయకుండా నిజాయితీగా పోరాడే సిఐటియును గెలిపించారన్నారు. ఇది రైల్వే కార్మికుల, ఉద్యోగుల విజయమన్నారు. దక్షిణ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ కోసం జిల్లాలో పుత్తూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట రైల్వేస్టేషన్లలో జరిగిన ఎన్నికల బూత్‌లలో సహకరించి కృషి చేసిన సిఐటియు కార్యకర్తలకు, నాయకులకు అభినందనలు తెలిపారు.

తిరుమలలో అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుమల మాడవీధుల విస్తరణలో భాగంగా కూల్చివేసిన అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించాలని, లేనిపక్షంలో ఫిబ్రవరి 22న ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని మంగళం అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి స్పష్టం చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించాలని, తొలగించిన హనుమంతుని విగ్రహాన్ని యథాస్థానంలో ప్రతిష్టించాలని కోరుతూ పుణ్యక్షేత్రాలు తిరిగి భక్తుల సంతకాలు సేకరించి టిటిడికి సమర్పించామన్నారు. అన్నమయ్య గహ సాధన సమితి, జై భారత్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ డిమాండ్లపై పోరాడుతున్నామన్నారు. టిటిడి అనుబంధ ఆలయాల్లో నిత్య హరినామ సంకీర్తన జరగాలని అప్పుడే పూర్తిస్థాయిలో తిరుమల పుణ్యక్షేత్రం ప్రక్షాళన అవుతుందన్నారు. భక్తి గీతాలు నేర్పించే గురువులకు టిటిడి గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జై భారత్ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసి యోధ లోకనాథ్, ఖదిజ్ఞాసి మల్లికావల్లభ, ఖదిజ్ఞాసి మహేష్ పాల్గొన్నారు.



జోరు వానలోనూ రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ

కుంభవర్షం కురుస్తున్నా రెవెన్యూ అధికారులు సదస్సులను నిర్వహిస్తూనే ఉన్నారు. గ్రామస్తులకు ఒకింత ఇబ్బందిగా ఉన్నా, దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు అర్జీదారులు వర్షంలోనూ సదస్సులకు విచ్చేయడం కనిపించింది. మండలంలోని తిమ్మ భూపాలపురం గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సదస్సులను నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కలెక్టర్ సుధారాణి తెలిపారు. అడంగళ్ 1బి, రిజిస్టర్ 22 (ఏ), భూ కొలతల్లో తేడాలు, సర్వే నంబర్లలో సమస్య, భూ విస్తీర్ణంలో తేడాలు, రీ సర్వే రికార్డుల్లో నమోదైన తప్పులు, అసైన్డ్, చుక్కల భూముల పరాధీనం, కబ్జాలు తదితర సమస్యలు రెవెన్యూ సదస్సులో అర్జీలిస్తే అధికారులు పరిశీలించి పరిష్కారిస్తారని తెలిపారు. శ్మశానానికి వెళ్లటానికి దారి లేక పోవటంతో శవాన్ని పంట పొలాలలో తీసుకుపోవటానికి నానా అవస్థలు పడుతున్నామని, శ్మశానానికి దారి సౌకర్యం కల్పించాలని కోరారు. రైతులు పలు భూసమస్యలపై వినతులను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీటీ చంద్రబాబు నాయుడు, ఆర్ఐ నల్లయ్య, వీఆర్ భాస్కర్, సర్పంచ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ఫర్నిచర్ షాపును ప్రారంభించిన పులివర్తి నాని

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

'గృహమే కదా స్వర్గసీమ' అన్నట్లుగా ఇంటికి అవసరమయ్యే అందమైన ఫర్నిచర్ షాపును చంద్రగిరి ఎంఎల్ఎ పులివర్తి నాని గురువారం ప్రారంభించారు. చంద్రగిరి తొండవాడ బస్టాండ్ నయారా పెట్రోల్ బంక్ సమీపంలో మండల టిడిపి ఉపాధ్యక్షులు అత్తరీరు తులసీశ్వర్‌రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీసాయి తులసి ఫర్నిచర్ షాపును ప్రారంభించారు. షాపులో వివిధ రకాల అందాల ఫర్నిచర్‌ను చూసి మెచ్చుకున్నారు. ఇతరులపై ఆధారపడకుండా ప్రజలు స్వయంశక్తితో ఉపాధి పొందాలని, తులసీశ్వర్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో వి.సుబ్రమణ్యంనాయుడు, ఎస్.గౌస్‌బాష, ఎజిపల్లి బాలకృష్ణ నాయుడు పాల్గొన్నారు.

నేడు వర్చువల్‌గా కార్తీక మహా దీపం వేడుక

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

కార్తీక మహా దీపం పండుగ లక్షలాది మంది భక్తులకు మహోన్నతమైన ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను కలిగి ఉంది. భారతదేశంలోని అతిపెద్ద భక్తి వేదిక అయిన శ్రీ మందిర్ డిసెంబర్ 13న శుక్రవారం కార్తీక మహా దీపం లైవ్ దర్శన్ స్పెషల్‌లో పాల్గొనేందుకు భక్తుల కోసం ఒక ప్రత్యేక కార్యక్రమంను తీసుకువచ్చిందని శ్రీ మందిర్ వ్యవస్థాపకులు, సీఈవో ప్రశాంత్ సచన్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్తీక మహా దీపం తిథితో జరిగే ఈ పవిత్ర కార్యక్రమం అరుణాచల తీర్థ శివ పార్వతీ కళ్యాణం, మహా రుద్ర హోమంలను భక్తులు వర్చ్యువల్ గా దర్శించుకునేందుకు అనుమతిస్తుందన్నారు. తమిళనాడులోని తిరువణ్ణామలై పవిత్ర పట్టణం నుండి అరుణాచలేశ్వర దీపం ప్రత్యక్ష దర్శనం సైతం వర్చ్యువల్ గా వీక్షించవచ్చు అన్నారు.

ఉచిత వైద్యశిబిరం అభినందనీయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్

పట్టణంలోని పిఆర్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఎంఎల్ఎ సునీల్‌కుమార్ చేతులమీదుగా ప్రారంభించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించడం అభినందనీయమన్నారు. వైద్యశిబిరం ఏర్పాటుకు శ్రమించిన నవీన్‌కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కమిటీ సభ్యులు కోడూరు మీరారెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, సీనియర్ ఆడిటర్ కంటి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

చిట్టేడు శ్రీ పోలేరమ్మ జాతర ముగింపు

ప్రజాశక్తి -కోట

కోట మండలంలోని చిట్టేడు గ్రామంలో శుక్రవారం ఆరవ తేదీ నుండి మొదలైన పోలేరమ్మ జాతర మహోత్సవంలో భాగంగా గ్రామంలోని గ్రామదేవత చిట్టేటమ్మ గ్రామ పొంగలితో మొదలై, శ్రీ మహాలక్ష్మమ్మ అంకమ్మ చెంగాలమ్మ బంగారమ్మ గ్రామ పొంగళ్ళు , సద్ది అంబళ్లు సమర్పించారు. జాతర కార్యక్రమంలో భాగంగా గ్రామం అన్ని వీధుల్లో విద్యుత్ దీపాలంకరణలతో ఘటువు, గంగపెట్టే, కలశాలతో ఊరేగింపులు చేశారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొత్తం మీద పంటలు కోతలు కోసిన తర్వాత పోలేరమ్మ జాతర నిర్వహిస్తారని, అయితే చిట్టెడు గ్రామంలో పూర్వకాలం నుండి వరి నార్లు వేసిన తర్వాత మాత్రమే జాతర మహోత్సవం నిర్వహిస్తారని తెలియజేశారు. గురువారం తెల్లవారుజామున అఖండ దీపంతో గ్రామ పొలిమేర దాటించి ముగింపు చేసినట్లు తెలియజేశారు.

మామిడి రైతులు పంటల బీమా చేసుకోవాలి

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు

మామిడి రైతులు ఈనెల 15లోపు వాతావరణ ఆధారిత పంటల బీమా చేసుకోవాలని మండల ఉద్యాన శాఖ అధికారి పి.శివకుమారి రైతులకు సూచించారు. కాలానుగుణంగా వాతావరణంలో వచ్చే ప్రతికూల మార్పులతో పంట నష్టం కలిగి ఆర్థిక నష్టాల నుంచి రైతులను ఆదుకునేందుకు పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమీ పథకాన్ని రబీ సీజన్‌లో అమలు చేస్తున్నామన్నారు. ఎకరాకు 35వేలు బీమా పొందేందుకు రూ.1750 ప్రీమియంను చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు.

మిరప రైతులకు సూచనలు

బిఎన్ కండ్రిగ : వర్షాలకు మిరప తోటల్లో నీరు నిలబడి ఉంటే వెంటనే బయటకు పంపాలని అగ్రికల్చర్ అధికారి యామిని సూచించారు. వెంటనే కాపర్ ఆక్సిజన్ క్లోరైడ్ (బ్లీత్సో) లేదా రిడామిల్ ఎంఙ్ఏ 3 గ్రామ్స్ ఒక లీటర్ నీటికి కలిపి కాండము, వేరు, మొదళ్లు మొక్క అంత బాగా తడిచేలా స్ప్రే చేయాలన్నారు. రెండు రోజులు తరువాత, 19:19:19ఏ 2-3 గ్రాం ఒక లీటర్ నీటికి ఆగ్రోమిన్ మాక్స్ ఏ 2 గ్రామ ఒక లీటర్ నీటికి కలిపి స్ప్రే చేయాలన్నారు.



గంధ మహోత్సవానికి ఆహ్వానం

పుత్తూరు టౌన్ : గేటుపుత్తూరు ఆనంబట్టు రోడ్డులో ఉండే ఖాదర్‌వలీ దర్గా జెండామాను వద్ద ఈనెల 20న జరగనున్న గంధపు మహోత్సవానికి ముస్లీం మైనార్టీ టిడిపి నాయకులు ఎంఎల్ఎ గాలి భానుప్రకాష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఖాజాపీర్ మహ్మద్‌నబీ, మహ్మద్ రఫీ, కరీం అలీషా, సలీం, షాజహాన్ పాల్గొన్నారు.

ఉడాయించిన ప్రైవేట్ బస్సు డ్రైవర్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

అయ్యప్ప స్వామి మాలతో యాత్రకు వచ్చిన 35 మంది భక్తులను నడిరోడ్డుపై వదిలేసి కావేరి ట్రావెల్స్ బస్సు డ్రైవర్ ఉడాయించిన ఘటన గురువారం ఉదయం తిరుపతిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... గుంటూరుకు చెందిన 35 మంది కావేరి ట్రావెల్స్ ద్వారా అయ్యప్ప మాలతో యాత్రకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తిరుపతికి చేరుకుని, బస్సును అలిపిరి లింకు బస్టాండ్ వద్ద ఉంచి తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లారు. స్వామి దర్శనానంతరం అయ్యప్ప భక్తులు రావడానికి ఆలస్యం కావడంతో, తిరుపతి లింకు బస్టాండ్ వద్ద ఉన్న ట్రావెల్స్ బస్సు డ్రైవర్, క్లీనర్ అయ్యప్ప భక్తుల లగేజ్‌ని రోడ్డుపై వదిలేసి, బస్సును తీసుకొని వెళ్ళిపోయారు. తిరుపతికి చేరుకున్న భక్తులు అక్కడ బస్సు లేకపోవడంతో డ్రైవర్ను ఫోన్లో సంప్రదించారు. మీకు ఇచ్చిన సమయం అయిపోయిందని, అందుకే వెళ్ళిపోతున్నానని బస్ డ్రైవర్ సమాధానం ఇవ్వడంతో విధి లేని పరిస్థితుల్లో తమకు న్యాయం చేయాలని డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పోలీసులు ట్రావెల్స్ బస్సు కోసం గాలింపులు చేపట్టారు, బస్సు నెల్లూరు చెక్‌పోస్టు వద్ద వెళ్తుండడంతో, చెక్ పోస్ట్ సిబ్బందితో సంప్రదించి బస్సును అక్కడే ఆపారు. బస్ డ్రైవర్ బస్సును తిరుపతికి తీసుకువచ్చేందుకు ససేమిరా అనడంతో, పోలీసుల సహాయంతో భక్తులు అవస్థ పడుతూ నెల్లూరుకు చేరుకుని అదే బస్సులో తిరుగు ప్రయాణమయ్యారు. పోలీసులు వెంటనే స్పందించి తమకు న్యాయం చేయడంతో భక్తులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డున పడ్డ అయ్యప్ప భక్తులు



గణేష్‌ను విధుల్లోకి తీసుకోవాలి


ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



దశాబ్ద కాలంపైగా ఉమ్మడి చిత్తూరు జిల్లా చిత్తూరు డివిజన్ పరిధిలో హైలీ స్కిల్డ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిగా పనిచేసే గణేష్‌ను విధుల్లోకి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో జరిగిన గొడవ విషయంలో గణేష్ పై పోలీసు కేసు నమోదు అయ్యిందని, ఇది కారణం చూపుతూ విధుల నుండి తొలగించారన్నారు. ఈ కేసులో కోర్టు నిర్దోషిగా తేల్చిందన్నారు. విధుల్లోకి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ ఇచ్చామన్నారు. కలెక్టర్ విద్యుత్ శాఖ ఎస్ఈకు విధుల్లోకి తీసుకోవాలని సూచించారన్నారు. అధికారులు ఒప్పుకున్నా కాంట్రాక్టర్ మాత్రం సుముఖత చూపడం లేదన్నారు. నలుగురు పిల్లలు ఉన్నారని, దళితుడని వివక్ష చూపకుండా విధుల్లోకి తీసుకొని న్యాయం చేయాలని కాంట్రాక్ట్ కార్మికుడు గణేష్ విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి, ట్రాన్స్కో డివిజన్ అధ్యక్షులు శరవణ, కలిగిరి డివిజన్ అధ్యక్షులు రెడ్డప్ప, చిత్తూరు జిల్లా కోశాధికారి రాజు, కార్మికుడు గణేష్ భార్య వేదవతి పాల్గొన్నారు.

రేపు సాగునీటి సంఘాల ఎన్నికలు

ప్రజాశక్తి - సత్యవేడు



తిరుపతి జిల్లా సత్యవేడు మండలంలో డిసెంబర్ 14వ తేదీన సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు స్థానిక ఇరిగేషన్ డిఈ సుబ్బరత్నారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలోని 13 చెరువులకు సంబంధించి సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతుందన్నారు. ప్రతి చెరువుకు సంబంధించి 6 మంది ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులను ఎన్నుకుంటారన్నారు. ఆయుకట్ట రైతులు చేతులు ఎత్తడం ద్వారా సభ్యుల ఎన్నికల ప్రక్రియ జరుగుతుందన్నారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల ఎన్నిక పూర్తయిన తర్వాత వెంటనే అధ్యక్షులు, ఉపాధ్యక్షుడు ఎన్నిక కూడా ఉంటుందన్నారు. ఎన్నికైన 6 మంది ప్రాదేశిక సభ్యులు వీరిని ఎన్నుకుంటారని ఆయన చెప్పారు.

ఇందులో భాగంగా మండలంలో పుదుకుప్పం(140 ఓట్లు), ఆంబాకం(119), పేరడం(98) చెరువులకు సంబంధించి పుదుకుప్పం జడ్పీ హైస్కూల్లో ఎన్నికలు జరుగుతాయి. మదన్జేరి(88), సిరణంబూదూరు చిన్న చెరువు(76), సిరణంబూదూరు పెద్ద చెరువు(123) చెరువులకు సిరణంబూదూరు ప్రభుత్వ పాఠశాల, మధనంబేడు(220), విఆర్ కండ్రిగ(369), కన్నవరం జడేరి(171) మధనంబేడు జడ్పీ హైస్కూల్లో ఎన్నికలు జరుగుతుందన్నారు. అలాగే ఓబుల్ రాజు కండ్రిగ(281), పివిపురం(120), రాజగోపాలపురం(162), రాజగోపాలపురం జడ్పీ హైస్కూల్లో, దలవాయిఅగ్రహారం(132) చెరువుకు సంబంధించి సత్యవేడు పట్టణం మెయిన్ స్కూల్లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతుందని ఆయన వివరించారు. డిసెంబర్ 14వ తేదీన ఉదయం 8 గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు



ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు టౌన్, రూరల్ పాస్టర్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్రాంతి ఉద్యోగుల భవనంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ డాక్టర్ పాశిం సునీల్ కుమార్, ప్రసంగీకులుగా ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ఎలమంచి ప్రవీణ్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ నిరంతరం పాస్టర్లకు, సంఘ కాపరులకు అందుబాటులో ఉంటానని, వారికి తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. తన ఆధ్వర్యంలో ఈనెల 23న ప్రి క్రిస్‌మస్ వేడుకలు నిర్వహిస్తానన్నారు. దైవ సేవకులకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం 2025వ సంవత్సర క్యాలెండరును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వి ప్రభుదాస్, ప్రొఫెసర్ రత్న శేఖర్, డేవిడ్, దేవ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ప్రభుదాస్ , రత్నశేఖర్ , కోర్నిలీనియస్ , డేవిడ్ , యోహాను , రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్‌లో... చర్చి కాంపౌండ్‌లో ఇమ్మానుయేల్ పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. కేకును నగరి నియోజకవర్గ ఎంఎల్ఎ గాలి భానుప్రకాష్ చేతుల మీదుగా కత్తిరించి పంచిపెట్టారు. తన తండ్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు అడుగు జాడల్లో తాను నడుస్తానని ఎంఎల్ఎ అన్నారు. టిడిపి నాయకులు అమ్ములు ఏలుమలై, గంజి మాధవయ్య, ఎన్ఎన్ ధనపాల్, డిజి ధనపాల్, డి.శ్రీనివాసులు, మేడిపల్లి రూపేంద్ర పాల్గొన్నారు.



నూతన పరిజ్ఞానం రైతులకు అందాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

పంటల సాగులో నూతన శాస్త్ర పరిజ్ఞానాన్ని రైతుల దరి చేర్చి వారి అభివృద్ధికి సహాయపడాలని వ్యవసాయ శాఖ జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ మెరుగు భాస్కరయ్య. పేర్కొన్నారు. పుత్తూరు, సత్యవేడు డివిజనులో పనిచేస్తున్న రైతు సేవా కేంద్రాల సిబ్బందికి పుత్తూరు విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఏర్పాటుచేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. సాగులో అధిక దిగుబడుల సాధనకు, చీడలను ఎదుర్కొనే రకాలు, జీవన ఎరువులు, పురుగు, తెగుళ్ల నివారణ మందులు, సేంద్రియ ఎరువుల వినియోగం డ్రోన్ల వాడకం సాగు ఖర్చును బాగా తగ్గిస్తుందని చెప్పారు. వరి సాగులో చేపట్టవలసిన సమగ్ర చీడల నివారణపై జిల్లా వనరుల కేంద్రం ఏఓ. వేణుగోపాలరావు వివరించారు. పూల సాగుపై రాస్ కషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త సుధాకర్ శిక్షణ ఇచ్చారు. లిల్లీ పూల లో నులిపురుగులు, మల్లె పూలలో నష్టపరుస్తున్న పూ మొగ్గ తొలిచేపురుగు, ఎర్ర నల్లి చీడల నివారణ గురించి ఆయన వివరించారు. భూసార పరీక్షలు, భూసారా పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల యాజమాన్యం గురించి డిటిసి భాస్కరయ్య వివరించారు. శిక్షణ అనంతరం సిబ్బందికి పరీక్ష నిర్వహించి విజేతలకు పుత్తూరు, సత్యవేడు ఏడిఏ రమేష్, సుబ్రహ్మణ్యం బహుమతులు అందజేసి అభినందించారు.

రేపు లోక్ అదాలత్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి కోర్టు ఆవరణలో డిసెంబర్ 14వ తేదీ జరిగే జాతీయ లోక్ అదాల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, వివాహ, మోటార్ వాహన సంబంధ కేసులతో పాటు, రాజీ కాదగిన క్రిమినల్ కేసులు, వ్యాజ్యం వేయని కేసులను లోక్ అదాలత్ ద్వారా అక్కడికక్కడే పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కక్షిదారులు పెద్ద సంఖ్యలో అదాలత్ కార్యక్రమానికి హాజరయ్యేలా సంబంధిత శాఖల అధికారులు, న్యాయవాదులు చొరవ చూపాలని సూచించారు.

విశేష అలంకరణలో సంతాన సంపద వెంకన్న స్వామి

ప్రజాశక్తి- ఏర్పేడు

ఏర్పేడు మండలం వికతమాల శ్రీ సంతాన సంపద వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామివారి నేత్ర దర్శనంతో పాటు విశేషాలంకరణ, పూజా కైంకర్యాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితులు కష్ణమాచార్యులు, రత్నాకరం రామాచార్యులు స్వామివారిని అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

క్రైం న్యూస్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- వాకాడు



అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన చిట్టమూరు మండల సమీపంలోని సోమసముద్రం అగ్రహారం వద్ద చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు... గురువారం మధ్యాహ్నం పొలాల్లోని ఒక షెడ్డులో విగతజీవిగాపడి ఉన్న ఈదురు రవి (36)ను గ్రామస్తులు గుర్తించారు. అగ్రహారానికి చెందిన సుబ్బరామయ్య కొడుగ్గా గుర్తించారు. ఆయనకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య శైలుతో కలిసి ఇద్దరూ కొంతకాలంగా ఓ ప్రైవేట్‌కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం. ఎస్ఐ బలరామయ్యను ఈ విషయమై వివరణ కోరగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారిస్తున్నామని, మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం బాలిరెడ్డిపాలెం ఆస్పత్రికి పంపించినట్లు తెలిపారు.

ఎర్రచందనం స్మగ్లర్లు ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శేషాచలం అటవీ పరిధి అన్నమయ్య జిల్లా రాయచోటి సమీపంలోని సుండుపల్లి - సానిపాయ మార్గంలో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు స్మగ్లర్లును అరెస్టు చేసి, వారి నుంచి 10 ఎర్రచందనం దుంగలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఎస్ఐ కె. లింగాధర్ టీమ్ గురువారం ఉదయం సుండుపల్లి-సానిపాయ మార్గంలో వాహనాలు తనిఖీ చేపట్టారు. ఒక వాహనం అతి వేగంగా వస్తుండగా టాస్క్ ఫోర్స్ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కారులో ఉన్న వ్యక్తులు దిగి పారిపోతుండగా వెంబడించి ఇద్దరు వ్యక్తులను అదుపులకు తీసుకున్నామన్నారు. పట్టుబడ్డ వీరు అన్నమయ్య జిల్లా వాస్తవ్యులుగా గుర్తించామన్నారు. టాస్క్ ఫోర్స్ సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కబ్జాదారు గిరిని అరెస్టు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - కెవిబిపురం

పదవిని అడ్డం పెట్టుకుని భూకబ్జాలకు పాల్పడటమే కాకుండా, మహిళపై దాడిచేసిన సర్పంచి కుమారుడు హరిబాబు అలియాస్ గిరిని అరెస్టు చేయాలని సిపిఎం డిమాండ్‌చేసింది. మండలానికి మారుమూల ప్రాంతమైన అంజూరుపాలెం గ్రామంలో సర్పంచి పదవిని అడ్డం పెట్టుకుని పేదల భూములను కబ్జా చేస్తున్న హరిబాబుపై ల్యాండ్ గ్రాంబ్లింగ్ చట్టం కింద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్, మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు డిమాండ్‌చేశారు. గ్రామంలోని కస్తూరికి పసుపు కుంకుమ కింద పుట్టింటివారు ఇచ్చిన భూమిని దౌర్జన్యంగా కబ్జా చేయాలని హరిబాబు చూస్తున్నారన్నారు. పొలాన్ని జెసిబిలతో చదును చేస్తుండగా అడ్డు వచ్చిన కస్తూరిని మహిళ అని చూడకుండా దాడిచేసి గాయపరిచారన్నారు. అర్ధరాత్రి వారు నివాసం ఉండే పూరింటిపై పెట్రోల్‌పోసి తగలబెట్టడం దారుణమన్నారు. సర్పంచి పదవిని అడ్డు పెట్టుకుని గ్రామంలో దాడులకు పాల్పడుతున్నాడని, మాదిగలపైనా దాడులు చేయించి బీభత్సం సృష్టించారన్నారు. హరిబాబును నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'కాఫ్రికార్న్' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - సత్యవేడు

కాఫ్రికార్న్ ఫ్యాక్టరీ యాజమాన్యం గత 20 సంవత్సరాలకు పైగా పనిచేసిన కార్మికులను అర్ధాంతరంగా విధుల్లో నుంచి తొలగించడం దారుణమని, తక్షణమే ప్రభుత్వం యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సత్యవేడు మండలం పాలగుంట గ్రామం వద్ద ఉన్న కాఫ్రికార్న్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులను ఎలాంటి నోటీసులు లేకుండా విధుల నుంచి తొలగించడం, కార్మిక చట్టాలకు విరుద్ధమని పేర్కొన్నారు. గతంలో అనేకమార్లు వలస కార్మికులు ఫ్యాక్టరీలో మరణించినా కార్మిక చట్టాలను అమలు చేయలేదన్నారు. కార్మికులు శాంతియుతంగా సమ్మెచేస్తుంటే గన్‌మెన్‌లను ప్రయోగించి భయభ్రాంతులకు గురిచేయడం దారుణమన్నారు. కార్మికలను విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తుపాకులతో భయభ్రాంతులకు గురిచేస్తున్న ఫ్యాక్టరీ అధికారులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



వంశీకి అన్నమయ్య సేవారత్న పురస్కారం

ప్రజాశక్తి- ఏర్పేడు

అన్నమయ్య జిల్లా రాజంపేటలో విభిన్న ప్రతిభావంతుల సంఘం వారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వేచ్ఛ ఫౌండేషన్ వంశీకి, తాను చేస్తున్న సేవలను గుర్తించి రాజంపేట జనసేన నాయకులు అతిథారి కష్ట చేతుల మీదుగా అన్నమయ్య సేవారత్న పురస్కారాన్ని అందించారు.

ముగిసిన హ్యాకథాన్-2024 పోటీలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శాస్త్ర సాంకేతికను ఉపయోగించి ఆరోగ్య రంగంలో ఎదురవుతున్న సవాళ్ళను అధిగమించడమే లక్ష్యంగా స్థానిక తిరుపతి ఐఐటీలో కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ నిర్వహించిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2024 పోటీలు గురువారం ముగిశాయి. దేశవ్యాప్తంగా 52 నోడల్ కేంద్రాల నుంచి 1300 మంది విద్యార్థులు హ్యాకథాన్ పోటీలకు హాజరు కాగా నాలుగు టీమ్ లు విజేతలుగా నిలిచాయి. ఒక్కో టీమ్ రూ.లక్ష .చొప్పున బహుమానం అందుకుంది. టీమ్ లీడర్ సుస్మిత నేతత్వంలోని 'స్టాక్ స్క్వాడ్', శ్వేత నేతత్వంలోని 'ప్రగతిమిత్ర', కార్తీక్ నేతత్వంలోని 'కోడ్ క్రాఫ్ట్', కౌసల్ వ్యాస్ నేతత్వంలోని 'సాత్విడం' టీమ్ లు ఆరోగ్య రంగానికి అవసరమైన సరికొత్త ఆవిష్కరణలు చేసి విజేతలుగా నిలిచారు. వీరికి ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ బహుమతులు ప్రదానం చేశారు.



పర్యవేక్షణ లోపం...ఫలితం నాశిరకం..

ప్రజాశక్తి - సత్యవేడు

సత్యవేడు మండల కేంద్రంలోని జ్యోతిరావు పూలే బిసి బాలుర గురుకుల పాఠశాలలో పి ఎం సి కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించబడుతున్న కెమిస్ట్రీ ల్యాబ్ గది నిర్మాణంలో పలు అవకతవకలు జరుగుతున్నట్లు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం పరుస్తున్నారు. సుమారు 1800 చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మించబడుతున్న ఈ నూతన గది కేంద్ర ప్రభుత్వం పిఎంసి నిధులతో సర్వ శిక్ష అభియాన్ వారి సాంకేతిక సహకారంతో నిర్మించబడుతుంది. ఇప్పటికీ ఈ గది నిర్మాణానికి సంబంధించి సుమారు పది లక్షల రూపాయలు కేంద్ర ప్రభుత్వం స్థానిక పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఖాతా ద్వారా విడుదల చేసి పనులు కొనసాగుతుండగా కనీసం స్లాబ్ పనులు కూడా పూర్తికాని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఈ గదికి స్లాబ్ పనులు చేస్తున్న సందర్భంగా సాంకేతిక నిబంధనలను బేఖాతర్ చేస్తున్నారు. కేవలం చెక్క పలకల, కొయ్యలు మాత్రమే ఉపయోగించి స్లాబ్ కొరకైన అడుగు భాగాన్ని నిర్మిస్తున్నారు. ఈ గది పూర్తి నిర్మాణానికి వాడవలసిన ఓపిసి సిమెంట్‌కు ప్రతిగా పిపిసి సిమెంటును వాడుతున్నారు. అలాగే ఐ ఎస్ ఐ ముద్రణ లేని ఇనుప చూవ్వలను వాడకం, 8 నుండి 12 ఎం ఎం ఉన్న రాతి జల్లి వాడకం వంటి తక్కువ ఖర్చుతో కూడిన నాసిరకం సామగ్రితో నిబంధనలను ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా సాగుతున్న ఈ నిర్మాణాన్ని ఉన్నతాధికారులు స్పందించి నాణ్యమైన రీతిలో నిర్మించేలా చర్యలు చేపట్టాల్సిందిగా అధికారులను తల్లిదండ్రులు కోరారు. ఇందుకు సంబంధించి సర్వ శిక్ష అభియాన్ ఏ ఈ షేక్ ఆఫీసుల్లాను వివరణ కోరగా త్వరలో దీనిపై విచారణ చేపట్టి వివరణ ఇస్తానని తెలిపారు.

కెమిస్ట్రీ ల్యాబ్ గది నిర్మాణంలో అవకతవకలు

